సాక్షి

గుంటూరు

బుధవారం । 12 । జూలై । 2023



దుర్గమ్మకు సారె సమర్పణ

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సన్నిధిలో ఆషాఢ మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ మంగళవారం సారె సమర్పించారు.



నాగార్జునకొండ సందర్శన

విజయపురిసౌత్: నాగార్జునకొండను అమెరికా హార్వర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరజ్ ఎం గిడే మంగళవారం సందర్శించారు. కల్చరల్ డైరెక్టర్ రేగుళ్ల మల్లికార్జునరావు ఉన్నారు.



భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలు

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆషాఢ పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అర్చకులు స్వామి వార్లకు మంగళవారం ప్రత్యేక పూజలుచేశారు.

న్యూస్‌రీల్

రేపటి నుంచి టీచర్లకు జీవన నైపుణ్యాలపై శిక్షణ

జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ సంస్థ (ఎస్సీఈఆర్టీ) ఆధ్వర్యంలో ఈనెల 13,14,15 తేదీల్లో జీవన నైపుణ్యాలపై ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 50 పాఠశాలల నుంచి ఎంపిక చేసిన 100 మంది పీడీలు, పీఈటీలతో పాటు ఒక యాక్టివ్ టీచర్ బోయపాలెంలోని డైట్‌లో జరిగే శిక్షణ తరగతులకు హాజరు కావాల్సిందిగా సూచించారు. ఎంపిక చేసిన ఉపాధ్యాయులు శిక్షణ తరగతులకు హాజరయ్యే విధంగా చూడాలని, వారిని విధుల నుంచి రిలీవ్ చేసి పంపాల్సిందిగా సంబంధిత పాఠశాలల హెచ్‌ఎం, ప్రిన్సిపాల్స్‌ను ఆదేశించారు.

యార్డుకు 45,625 బస్తాల మిర్చి రాక



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 45,625 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 44,034 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.25,500 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాకు రూ.12,500 నుంచి 22,000 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చి రూ. 10,000 నుంచి రూ. 26,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 15,825 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

అనుమతి లేకుండా టీకాలు వేస్తే కఠిన చర్యలు

డీఎంహెచ్‌ఓ డాక్టర్ శోభారాణి

నరసరావుపేట: జిల్లాలోని స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేటు సంస్థలు సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాలు కాకుండా, వేరే టీకాలు స్వచ్ఛందంగా ప్రజలకు వేయాలనుకుంటే ముందుగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలా తీసుకోకుండా వ్యాక్సినేషన్ కార్యక్రమం చేస్తే ఆ వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ జీఎం శేషభానురావు మృతి



తెనాలి: గుంటూరు జిల్లా కో–ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ జనరల్ మేనేజర్ పిన్నక శేషభానురావు (52) మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లో మృతి చెందారు. గత రెండు నెలలుగా ఆయన అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. అయినా ప్రయోజనం లేకపోయింది. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రకాశం జిల్లాకు చెందిన శేషభానురావు, బ్రాంచి మేనేజరుగా వృత్తిజీవితం ఆరంభించారు. తర్వాత గుంటూరు జిల్లాకు వచ్చారు. తెనాలిలో స్థిరపడ్డారు. ఏజీఎంగా, డీజీఎంగా పనిచేసి, తన సమర్థతతో అనతికాలంలోనే జనరల్ మేనేజరుగా ఎదిగారు. ఆయనకు కళలంటే వల్లమాలిన ప్రేమ. సాంస్కృతిక కార్యక్రమాలకు ఇతోధిక సహకారం అందించేవారు. ఆయన కుమారుడు, కుమార్తెకు రెండు నెలల క్రితమే వివాహాలు నిశ్చయమయ్యాయి. ఇద్దరి పెళ్లిళ్లు ఘనంగా చేయాలని నిర్ణయించుకుని సన్నాహాల్లో ఉండగానే ఆయన కన్నుమూయటంతో ఆ కుటుంబసభ్యుల్లో విషాదం నెలకొంది. శేషభానురావు మృతదేహాన్ని బుధవారం తెల్లవారుజామున తెనాలి కొత్తపేటలోని ఆయన నివాసానికి తీసుకురానున్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 519.10 అడుగుల వద్ద ఉంది. సాగర్ నుంచి ఎస్ఎల్‌బీసీకి1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ 1,350 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.00 అడుగుల వద్ద ఉంది.



• సంక్షేమ సైన్యం కన్నెర్ర

వలంటీర్లపై పవన్ కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సేవా సైన్యం కన్నెర్ర చేసింది. ఊరూవాడా ఆగ్రహంతో రగిలింది. నీచ రాజకీయాలపై నిప్పులుగక్కింది. సంక్షేమ పాలనపై బురదజల్లితే ఊరుకునేది లేదని గర్జించింది. గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మలను వలంటీర్లు దహనం చేశారు. ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రత్తిపాడు పాతమద్రాసు రోడ్డులో పవన్ దిష్టిబొమ్మకు చీరకట్టి నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లను చిత్రంలో చూడొచ్చు. – సాక్షి ప్రతినిధి, గుంటూరు

ఇంటి గడపలోనే అన్నిరకాల సేవలు

- గత నాలుగేళ్లుగా పరిపాలనలో విప్లవాత్మక మార్పులు
- 'జగనన్న సురక్ష'తో సమస్యల పరిష్కారం వేగవంతం
- కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి వెల్లడి



లబ్ధిదారుకు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: పాలనను ఇంటివద్దకే చేరువ చేసి, ప్రజలకు అవసరమైన అన్ని సేవలను వారి ఇంటిగడపలోనే ప్రభుత్వం అందిస్తోందని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. ఇందుకోసం ప్రభుత్వం నాలుగేళ్లుగా విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చినట్టు చెప్పారు. పట్టణ 24, 25, 26 వార్డులకు సంబంధించి జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరం మంగళవారం పినపాడులో నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అధ్యక్షతన ఏర్పాటైన సభలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడారు. వలంటీరు, సచివాలయ వ్యవస్థలతో రాష్ట్రంలో ఎంతో మార్పు వచ్చిందని, సేవలు సులభతరమయ్యాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ క్యాలెండర్‌ను ప్రకటించి, ఆ ప్రకారం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా, సంక్షేమాన్ని చేరువ చేస్తున్నట్టు చెప్పారు. అందని వారుంటే ప్రతి ఆరునెలలకోసారి దరఖాస్తులు స్వీకరిస్తూ, సంక్షేమ లబ్ధిని అందిస్తున్నామని కలెక్టర్ వివరించారు.

తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ తెనాలి నియోజకవర్గంలో ఇళ్లస్థలాలతో సహా రూ.1600 కోట్ల వ్యయంతో సంక్షేమాన్ని అందజేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వంలో వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని ప్రజలకు 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందించేందుకు చేపట్టిన విప్లవాత్మక కార్యక్రమమే జగనన్న సురక్షగా చెప్పారు. ప్రజలకు ఇంతగా మంచి చేస్తున్న సీఎం జగన్‌ను, తననూ ఆశీర్వదించాలని కోరారు. మూడు వార్డుల్లో కలిపి 553 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లను కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి చేతులమీదుగా పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, కౌన్సిలర్లు పెదలంక లక్ష్మీలావణ్య, తాడిబోయిన రామయ్య, షేక్ నూర్ ఇస్మాయిల్ మాట్లాడారు. కార్యక్రమంలో తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, పౌరసరఫరాలశాఖ డీఎం జి.లక్ష్మి, డివిజనల్ అభివృద్ధి అధికారి కె.పద్మావతి, తహసీల్దార్ హెనాప్రియ, గొరికపూడి నిర్మలాదేవి, బూరెల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ నోటిని అదుపులో పెట్టుకో

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా



గుంటూరుఎడ్యుకేషన్: వలంటీర్ల వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగేలా మాట్లాడిన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ భేషరతుగా క్షమాపణలు చెప్పాలని గుంటూరు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా డిమాండ్ చేశారు. మంగళవారం గుంటూరులోని జెడ్పీ క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వలంటీర్ల గురించి తప్పుడు వ్యాఖ్యలు చేసిన పవన్ నోటిని అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. రాజకీయంగా అజ్ఞాని అయిన పవన్, ముందుగా రాజకీయ శిక్షణ తరగతులకు వెళ్లి, మాట్లాడే పద్ధతి తెలుసుకోవాలని చురకలంటించారు. వలంటీర్లలో అధిక శాతం మహిళలే ఉన్నారని, మూడు పెళ్లిళ్లు చేసుకున్న పవన్‌కు మహిళలను గౌరవించడం అంటే ఏమిటో ఎలా తెలుస్తుందని అన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2.80 లక్షల మంది వలంటీర్లను నియమించి చరిత్ర సృష్టించారని అన్నారు. వలంటీర్ల గురించి చవకబారు ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. పవన్‌కు విజ్ఞత లేదని, కనీసం ఒక్కసారైనా ప్రజా ప్రతినిధిగా గెలిచి ఉంటే మాట్లాడే విధానం తెలుస్తుందని అన్నారు. రాష్ట్రంలో 16వేల మంది మహిళలు మాయమయ్యారని చేసిన ఆరోపణలను నిరూపించాలని సవాల్ విసిరారు. వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతూ వలంటీర్లు అందిస్తున్న సేవలతో వెన్నులో వణుకుపుట్టి, సిగ్గు, శరం లేకుండా నీచమైన ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

'సర్వే' జనా సుఖీభవ

ఇంటింటికీ ఫీవర్ సర్వే

- వర్షాకాలం ఆరంభంతో అప్రమత్తం
- ఉచితంగా జ్వరం నిర్ధారణ పరీక్షలు
- మందులు అందజేత



గుంటూరు రైలుపేటలో ఫీవర్ సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

గుంటూరు మెడికల్: వర్షాకాలం ప్రారంభం కావడంతో పలు రకాల వ్యాధులు, ముఖ్యంగా దోమకాటు ద్వారా సంభవించే జ్వరాలు ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. సీజనల్ జ్వరాలు, ఇతర వ్యాధులు సోకకుండా ముందస్తుగా వైద్య సిబ్బంది అవగాహన కల్పించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో మంగళవారం గుంటూరు జిల్లాలో 50వ విడత ఫీవర్ సర్వే ప్రారంభమైంది.

ఇంటింటికీ సర్వే

కోవిడ్ నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గతంలో ఇంటింటికీ వైద్య సిబ్బందిని పంపించి ఇళ్ల వద్దే ప్రజలకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేయించి మందులు కూడా అందజేసింది. ఇప్పటి వరకు మూడేళ్లలో 49 విడతలుగా ఫీవర్ సర్వేలు రాష్ట్ర వ్యాప్తంగా జరిగాయి. తాజాగా మంగళవారం 50వ విడత ఫీవర్ సర్వేను అధికారికంగా ప్రారంభించారు. ఫీవర్ సర్వేలో భాగంగా వలంటీర్, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్, ఇంటింటికీ తిరిగి ప్రజలకు ఉచితంగా డెంగీ, మలేరియా, కోవిడ్, ఇతర జ్వరాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ఎవరికైనా జ్వరం ఉన్నట్టు తేలితే మందులు ఉచితంగా అందజేసి మెరుగైన చికిత్స కోసం సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తారు. తొలిరోజు ఫీవర్ సర్వేలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 1,47,973 ఇళ్లను వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సందర్శించారు. 19 మందికి వివిధ రకాల జ్వరాలు ఉన్నట్లు నిర్ధారణ అయింది. జిల్లా వ్యాప్తంగా 7,25,425 ఇళ్లు సర్వే చేసి ఆన్‌లైన్‌లో ఫీవర్ బాధితుల వివరాలు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నమోదు చేయాల్సి ఉంది.

సర్వేను వినియోగించుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో మంగళవారం 50వ విడత ఫీవర్ సర్వే ప్రారంభమైంది. ప్రజలు వైద్యసిబ్బందికి వివరాలు తెలిపి సహకరించాలి. జ్వరాలు ఉన్నట్టయితే మందులు తీసుకుని, ఆస్పత్రుల్లో చికిత్స తీసుకోవాలి.
– డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు

అవినీతితో అబస్‌పాలు

- ఆర్టీసీలో ఉద్యోగుల కష్టాలు
- బస్సుల మరమ్మతులకు నాసిరకం సామగ్రి వినియోగం
- ఎక్కడికక్కడ నిలిచిపోతున్న సర్వీసులు
- ప్రయాణికుల అవస్థలు
- గుంటూరు డిపో–1 పరిధిలో సమస్యలు, డ్యూటీ చార్ట్‌లో అవినీతిపై ఫిర్యాదులు
- గ్యారేజ్, అధికారుల నిర్వాకంతో ఇబ్బందులు పడుతున్న డ్రైవర్లు, కండక్టర్లు



ఆర్టీసీ గుంటూరు డిపో–1 బస్సు

పాత గుంటూరు: ప్రజా రవాణా సంస్థ (ఆర్టీసీ) ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ఉన్నతాధికారులు విశేష కృషి చేస్తున్నారు. ప్రభుత్వమూ చేయూతనందిస్తోంది. నష్టాలను తగ్గిస్తూ ఆర్టీసీని ఆదరించేలా ముందుకుసాగుతోంది. నిర్ణయించిన సమయానుసారం ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యంగా డ్రైవర్లు, కండక్టర్లు తమ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తున్నారు. అయితే గుంటూరు డిపో–1, గ్యారేజ్ అధికారుల నిర్లక్ష్యం, అవినీతి వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గ్యారేజ్‌లో మరమ్మతుల సమయంలో నాసిరకం సామగ్రి వినియోగిస్తుండటంతో నిత్యం రవాణా సమయంలో బస్సులు మొరాయిస్తున్నాయి. ఎక్కడికక్కడ నిలిచిపోతుండటంతో ప్రయాణికులతోపాటు డ్రైవర్లు అవస్థలు పడుతున్నారు. అంతేగాక కార్యాలయాల్లో ప్రతిపనికీ ఒక ధరను నిర్ణయించి సిబ్బంది నుంచి వసూలు చేస్తున్నారని డ్రైవర్లు, కండక్టర్లు చెబుతున్నారు. నచ్చినవారికి డ్యూటీలో మినహాయింపు నచ్చనివారికి అదనపు డ్యూటీలతో ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతోకాలంగా గుంటూరు డిపో–1 పరిధిలో ఉన్న పలు సమస్యలపై ఫిర్యాదులు చేసినా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఫిర్యాదు చేసిన వారిని అధికారులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గుంటూరు డిపో–1లో సిబ్బంది చెబుతున్న ప్రధాన సమస్యలివీ..

- ఇటీవల 50 బస్సులకుపైగా ఫ్యాన్ బెల్ట్ తెగి సర్వీసులకు అంతరాయం కలిగింది. ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.
- బస్సులకు రీ బటన్ టైర్లను ఎక్కువగా వినియోగిస్తుండటంతో పంక్చర్ అయి నిలిచిపోతున్నాయి.
- మెడికల్లీ అన్‌ఫిట్ డ్రైవర్లకు విధుల నుంచి మినహాయింపునకు ప్రతినెలా డబ్బులు వసూలు చేస్తున్నారు.
- డీఎం కార్యాలయంలో వార్షిక ఇంక్రిమెంట్లకు, పే ఎరియర్స్, మెడికల్ బిల్లులకు ఒకధర నిర్ణయించి డిమాండ్ చేస్తున్నారు.
- డీఎం తన సొంత వాహనాన్ని కార్యాలయానిదిగా చూపుతూ సంస్థ డ్రైవర్‌ను వినియోగిస్తున్నారు.
- కండక్టర్ బుకింగ్ చార్ట్‌లో అనుకూలమైన వారికి లైట్ డ్యూటీలు వేస్తూ, స్పాట్ సెలవులు ఇస్తూ లబ్ధి పొందుతున్నారు.
- అనుకూలంగా ఉన్న డ్రైవర్లకు ఒకలా, నచ్చని వారికి మరోలా డ్యూటీలు వేస్తున్నారు.

పరిష్కారానికి చర్యలు



గుంటూరు డిపో–1 పరిధిలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపడతాం. గ్యారేజ్‌లో సమస్యలు, డ్యూటీ చార్ట్, వసూళ్లపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ఉద్యోగులు తమ సమస్యలను నా దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తాను.
– రవికాంత్, ప్రజా రవాణా అధికారి, గుంటూరు

గ్రూపును 'ఆర్పీ'

- మెప్మాలో మరో మోసం
- డ్వాక్రా సభ్యుల రుణాల నుంచి రూ.70వేలు వసూలు
- తానే చెల్లిస్తానని నమ్మించిన ఆర్పీ చివరకు ఎగనామం
- గ్రూపు సభ్యులపై బ్యాంకర్ల ఒత్తిడి
- కలెక్టరేట్ 'స్పందన'లో ఫిర్యాదు



కలెక్టరేట్ రోడ్డులోని మెప్మా కార్యాలయం

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): మెప్మాలో మరో మోసం బయటపడింది. తప్పుడు ధ్రువ పత్రాలతో ఆటోనగర్ యూనియన్ బ్యాంకు మేనేజర్‌ను మోసం చేసి రూ.1.05 కోట్ల రుణం తీసుకుని తిరిగి చెల్లించని ఘటనను మరువక ముందే మరో బాగోతం వెలుగు చూసింది. ఓ గ్రూపును అడ్డుపెట్టుకుని రూ.ఏడు లక్షలు తీసుకున్న రిసోర్స్‌పర్సన్ (ఆర్పీ) చివరకు చెల్లింపులు జమ చేయకపోవడంతో బ్యాంకర్లు గ్రూపు సభ్యులపై ఒత్తిడి పెంచారు. దీనిపై సభ్యులు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు.

అసలేం జరిగిందంటే..

గుంటూరులోని ఐపీడీ కాలనికి చెందిన పది మంది శ్రావణి గ్రూపుగా ఏర్పడ్డారు. అయితే ఈ గ్రూపు నిర్వహణను చూసుకోవాల్సిన ఆర్పీ డి.పద్మ సహాయకురాలిగా ఎం.పద్మ అనే ఆమెను పెట్టుకుంది. శ్రావణి గ్రూపు కొత్తది కావడంతో రూ.30వేలకు మించి రుణం రాదని.. ఎం.పద్మ మరో వ్యక్తి సహకారంతో పాత గ్రూపును యాక్టివేట్ చేయించి దానిలో ఈ పదిమందినీ సభ్యులుగా యాడ్ చేయించింది. మనిషికి రూ.లక్ష చొప్పున రుణం ఇచ్చేలా అరండల్‌పేటలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు అధికారులను ఒప్పించింది. గత ఫిబ్రవరిలో రూ.లక్ష చొప్పున రూ.10లక్షలు సభ్యుల బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. ఈ డబ్బులు ఇవ్వాలంటే తనకు రూ.లక్ష కమీషన్ ఇవ్వాలని ఆర్పీ షరతు విధించింది. లేదా మనిషికి రూ.70 వేలు తనకు ఇవ్వాలని ఆ మొత్తాన్ని తానే బ్యాంకుకు చెల్లిస్తానని పేర్కొంది. దీంతో సభ్యులు రూ.70వేలు ఇచ్చి.. రూ.30 వేలు తీసుకునేందుకు అంగీకరించారు. మొత్తం రూ.7లక్షలు ఆర్పీ అసిస్టెంట్ ఎం.పద్మకు ఇచ్చారు. తమ వాటా రూ.30 వేలకు సంబంధించి ఏ నెలకానెల వాయిదాలు ఆర్పీకి ఇస్తున్నారు. అయితే రుణ వాయిదాలు చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు గ్రూపు సభ్యులకు ఫోన్ చేశారు. రుణం చెల్లించాలని ఒత్తిడి చేశారు. దీంతో కంగుతిన్న గ్రూపు సభ్యులు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు.

చాలాచోట్ల ఇదే తంతు

తూర్పు నియోజకవర్గంలో కొంత మంది ఆర్పీలు ప్రైవేటు వ్యక్తులను అసిస్టెంట్లుగా పెట్టుకుని మోసాలకు పాల్పడుతున్నారని పలు సంఘాల సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇదే ఆర్పీకి సహకరిస్తున్న ఓ వ్యక్తి ప్రైవేటు బ్యాంకుల్లో రుణాలు ఇప్పిస్తానని నమ్మబలికి కమీషన్లు తీసుకుంటున్నట్టు సమాచారం.

తీసుకోని మొత్తాన్ని చెల్లించమనడం అన్యాయం




ఎం.పద్మ, డి.పద్మ సహకారంతో మా గ్రూపునకు రూ.10 లక్షలు రుణం వచ్చింది. మనిషికి రూ.70 వేలు చొప్పున రూ.7 లక్షలు డి.పద్మ తీసుకుంది. ప్రతి నెలా తనే బ్యాంకుకు చెల్లిస్తానని చెప్పింది. మా వాటా వాయిదా కట్టడానికీ బ్యాంకుకు వెళ్లాల్సిన పని లేదని పేర్కొంది. ప్రతినెలా మేము మా వాటా వాయిదా ఆర్పీ అసిస్టెంట్‌కు చెల్లిస్తున్నాం. వారు బ్యాంకుకు నగదు చెల్లించడం లేదని బ్యాంకు వారు ఫోన్లు చేస్తున్నారు. అందుకే స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశాం. కూలి పనులు చేసుకునేవాళ్లం మేము రూ.70 వేలు ఎక్కడి నుంచి తీసుకొచ్చి కట్టాలి. అధికారులు న్యాయం చేయాలి.
– షేక్ అఖిల, శ్రావణి గ్రూపు లీడర్

విచారణ చేపడతాం

డ్వాక్రా గ్రూపు సభ్యుల నుంచి ఆర్పీ రూ.7 లక్షలు తీసుకుని బ్యాంకుకు చెల్లించడం లేదనే విషయం నా దృష్టికి రాలేదు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.
– పి.వెంకట నారాయణ, మెప్మా పీడీ

26 నుంచి రాష్ట్రస్థాయి ఫిజియో క్రికెట్ లీగ్ పోటీలు



గుంటూరుమెడికల్: ది ఫిజియోథెరపిస్ట్ ఫెడరేషన్ అమరావతి ఆంధ్రప్రదేశ్, చంద్ర న్యూరో కేర్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి 30 వరకు రాష్ట్రస్థాయి క్రికెట్ లీగ్ 2020 పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రెసిడెన్షియల్ యాక్టివిటీస్ చైర్మన్ డాక్టర్ మహమ్మద్ ఇమ్రాన్ తెలిపారు. మంగళవారం కొత్తపేట చంద్ర న్యూరో కేర్ ఆసుపత్రిలో పోటీల పోస్టర్ల ఆవిష్కరణ జరిగింది. పోటీలు చౌడవరం ఆర్వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో, నంబూరు గోకరాజు గంగరాజు, ఎంఎస్‌కే ప్రసాద్ క్రికెట్ గ్రౌండ్స్‌లో జరుగుతాయన్నారు. డాక్టర్ నల్లబోతు శరత్‌చంద్ర మాట్లాడుతూ విజేత జట్టుకు ట్రోఫీతోపాటు రూ.లక్ష, రెండో బహుమతి రూ.50 వేలు అందజేస్తామన్నారు.

అన్నను హతమార్చిన తమ్ముడు

- కుటుంబాన్ని ఇబ్బంది పెడుతున్నాడని...!
- స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయిన నిందితుడు


షాజహాన్ మృతదేహం

గుంటూరు రూరల్: మద్యానికి బానిసై కుటుంబ సభ్యులను ఇబ్బంది పెడుతున్నాడని తమ్ముడు అన్నను హత్య చేసిన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం నల్లచెరువు 1వ లైనుకు చెందిన షేక్ నూర్జహాన్‌కు ఇరువురు కుమారులు షేక్ షాజహాన్ (27), షేక్ సైఫలిఖాన్‌లున్నారు. భర్త నుంచి విడిపోయి నూర్జహాన్ తన ఇరువురి కుమారులతో తన తల్లి నివాస సమీపంలో ఇంటిని అద్దెకు తీసుకుని జీవిస్తోంది. ఇరువురు కుమారు లు కార్పెంటర్ పని చేస్తుంటారు. ఈ క్రమంలో షాజహాన్ మద్యానికి బానిసయ్యాడు. ప్రతిరోజు మద్యం తాగి ఇంటికి వచ్చి కుటుంబాన్ని ఇబ్బంది పెడుతున్నాడు. ఈ నేపథ్యంలో అన్నను చూసి విసుగు చెందిన సైఫలిఖాన్ మంగళవారం మధ్యాహ్నం అన్నను తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని ఇన్నర్ రింగ్ రోడ్డులో నగర శివారుకు తీసుకు వచ్చాడు. అక్కడ పాడుబడిన గోదాములోకి అన్నను తీసుకు వెళ్లి మద్యం తాగించాడు. అనంతరం కుటుంబ సభ్యులను ఇబ్బందిపెడితే చంపుతానని అన్నను బెదిరించాడు. దీంతో అప్పటికే తన వద్దనున్న కత్తితో షాజహాన్ తమ్ముడిపై తిరగబడటంతో తమ్ముడు సైఫలిఖాన్ అన్నచేతిలోని కత్తిని అందుకుని అన్నను మెడ, గొంతు, తదితర భాగాల్లో పొడిచి హత్య చేశాడు. అనంతరం నేరుగా నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయాన్ని పోలీసులకు వెల్లడించి లొంగిపోయాడు. విషయం తెలుసుకున్న సౌత్‌జోన్ డీఎస్పీ మహబూబ్ బాషా సంఘటన స్థలికి చేరుకుని పరిశీలించారు. నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నాటకాలకు నంది అవార్డులపై హర్షం

- సినిమాలకూ నందులు ఇవ్వండి...
- మా–ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా వినతి


మాట్లాడుతున్న దిలీప్‌రాజా

తెనాలి: నాటక రంగానికి చెందిన ఐదు విభాగాల్లో అక్టోబరులో 73 నంది అవార్డులు ఇస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించటంపై మా–ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్ రాజా సంతోషం వ్యక్తంచేశారు. దీనితోపాటు చాలాకాలంగా ఆగిపోయిన టీవీ, సినిమాలకూ నంది అవార్డులను ప్రదానం చేయటం బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఇక్కడి చెంచుపేటలోని మా–ఏపీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాటకరంగానికి, టీవీ, సినిమా రంగాలకు మధ్య పరస్పర సంబంధాలున్న నేపథ్యంలో టీవీ, సినీరంగాలకూ నంది అవార్డులను ప్రదానం చేయాల్సిందిగా కోరారు. నిష్పక్షపాతగా వ్యవహరించే న్యాయనిర్ణేతల కమిటీని ఏర్పాటుచేసి, రాజకీయాలకతీతంగా టీవీ, సినిమా నటీనటులు, సాంకేతిక నిపుణులకు నంది అవార్డులు ఇచ్చేలా ప్రభుత్వం జీవో జారీచేసి ఆయా రంగాలను ప్రోత్సహించాల్సిందిగా కోరారు. మా–ఏపీ సంయుక్త కార్యదర్శి మిలటరీ ప్రసాద్, అమీర్‌చౌదరి పాల్గొన్నారు.

హ్యాట్రిక్.. న్యూరాలజీ టీం

- సత్తాచాటిన జీజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్
- బెస్ట్ కాంట్రిబ్యూటరీ రీసెర్చ్ అవార్డు


న్యూరాలజీ వైద్యులను అభినందిస్తున్న డాక్టర్ సుందరాచారి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వైద్యులు రాష్ట్ర సదస్సులో తమ సత్తా చాటారు. ఈనెల 7 నుంచి 9 వరకు కర్నూలులో న్యూరో ఐకాన్, న్యూరాలజిస్టుల, న్యూరో సర్జన్‌ల రాష్ట్ర సదస్సు జరిగింది. సదస్సులో గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గొట్టిపాటి బిందు నర్మద ప్రజెంట్ చేసిన పరిశోధనకు బెస్ట్ కాంట్రిబ్యూటరీ రీసెర్చ్ అవార్డు లభించింది. అవార్డు కింద రూ. 50 వేలు నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేశారు. తలలో వత్తిడి పెరిగి కంటి నరం దెబ్బ తినడం.. కంటి చూపు కోల్పోవడం వంటి సమస్యలపై చేసిన పరిశోధనకు అవార్డు లభించింది. న్యూరాలజీ పీజీ డాక్టర్ కాంతిమకు పోస్టర్ ప్రజంటేషన్‌లో అవార్డు లభించింది. అవార్డులను అందుకున్న ఇరువురిని న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ నాగార్జున కొండ వెంకట సుందరాచారి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్‌లు అభినందించారు.

అధిక జనాభా దేశ ప్రగతికి అవరోధం

బాపట్ల జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ


ప్రదర్శనను ప్రారంభిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎస్.విజయమ్మ

బాపట్ల: అధిక జనాభా దేశ ప్రగతికి అవరోధంగా మారుతుందని బాపట్ల జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం నుంచి ప్రదర్శనను నిర్వహించారు. డాక్టర్ ఎస్.విజయమ్మ మాట్లాడుతూ దేశ జనాభాను తగ్గించేందుకు ఒక్కరు లేదా ఇద్దరితో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోవాలని సూచించారు. చిన్న కుటుంబాలు చింతలేని కుటుంబాలుగా భావించాలని, అధిక జనాభాతో వనరులు అందరికి సమృద్ధిగా అందవని గుర్తుంచుకోవాలని అన్నారు. మనదేశం పురోగతి కోసం మగవారికి 25సంవత్సరాలు, ఆడవారికి 21సంవత్సరాలు నిండేవరకు వివాహం చేయరాదని సూచించారు. సంపాదన పెరిగినప్పుడే వివాహ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టరు టి.వెంకటేశ్వర్లు, రమాదేవి, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

డెంగీ వ్యాధి నివారణకు ప్రత్యేక ప్రదర్శన

బాపట్ల పట్టణంలో జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో డెంగీ వ్యాధి నివారణకు ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు ప్రదర్శన చేపట్టారు. ప్రదర్శనను జిల్లా మలేరియా అధికారి వై.రాజకుమార్ ప్రారంభించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జ్వరాలు ఉంటే వెంటనే సంబంధిత వైద్య సిబ్బందికి సూచించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జూగుంట రాంబాబు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితా

చిలకలపూడి(మచిలీపట్నం): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ ఆధారంగా నిర్వహించిన జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టులకు సంబంధించిన మెరిట్ జాబితాను వెబ్ సైట్‌లో పొందుపరిచినట్లు డీఆర్వో ఎం వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లాకు సంబంధించిన అభ్యర్థుల జాబితాను www. krishna. ap. gov. in వెబ్‌సైట్‌లో పొందుపరచటం జరిగిందన్నారు. సంబంధిత అభ్యర్థులు మెరిట్ జాబితాను పరిశీలించుకోవాలని ఆయన సూచించారు.

వేమూరు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌గా శిరీష

ప్రభుత్వ ఉత్తర్వులను అందించిన మంత్రి మేరుగ నాగార్జున


ప్రభుత్వ ఉత్తర్వులను మంత్రి మేరుగ నాగార్జున చేతుల మీదుగా అందుకుంటున్న శిరీష

కొల్లూరు: వేమూరు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌గా కొల్లూరుకు చెందిన ఉప్పు శిరీషను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కొల్లూరులోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో మంత్రి మేరుగ నాగార్జున ఉత్తర్వులను శిరీషకు మంగళవారం అందించారు. గతంలో కొల్లూరు జెడ్పీటీసీ సభ్యురాలిగా శిరీష పనిచేశారు. ఆమెకు పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. ఇప్పటి వరకు వేమూరు మార్కెట్ యార్డు చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన బొల్లిముంత ఏడుకొండలు చైర్‌పర్సన్ శిరీషకు బాధ్యతలు అప్పగించారు. శిరీష మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అప్పగించిన మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ పదవికి న్యాయం చేసేలా వ్యవరించడంతోపాటు, రైతులకు మేలు చేకూరుస్తానని తెలిపారు. తనకు పదవి దక్కడానికి సహకరించిన మంత్రి మేరుగ నాగార్జునకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జి అయిల సుబ్బారావు, మాజీ సర్పంచి సుగ్గున మల్లేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉప్పు శ్రీనివాసరావు, యడ్ల రజని, యడ్ల పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో ఇంటర్ కొనసాగించాలి

నెహ్రూనగర్: జిల్లాలోని కాకుమాను, అడవితక్కెళ్లపాడు, తాడికొండ తదితర ప్రాంతాల్లో ఉన్న గురుకుల పాఠశాలల్లో పదవ తరగతి విద్యతో పాటు రెండు సంవత్సరాల ఇంటర్ విద్యను కొనసాగించాలని భీమ్ సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపు నీలాంబరం కోరారు. గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జునను కలసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న పలు గురుకుల పాఠశాలల్లో పదితోపాటు ఇంటర్ విద్య కూడా ఉండేదని, ప్రస్తుతం జిల్లాలు విడిపోయిన తరువాత గురుకులాల్లో ఇంటర్ విద్య లేకపోవడం వలన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్పందించిన మంత్రి గురుకుల పాఠశాలలో ఇంటర్ విద్య ప్రవేశపెట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో ప్రభుదాస్, జాన్‌బాబు, రాజకుమారి, నాగభూషణం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నగదు రహిత సేవలు అందించకుంటే చర్యలు

- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీపై జిల్లా క్రమశిక్షణ కమిటీ సమావేశంలో పల్నాడు జిల్లా కలెక్టర్
- డబ్బులు వసూలుచేసిన ప్రైవేటు హాస్పిటల్‌కు నాలుగురెట్ల పెనాల్టీ


కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్

నరసరావుపేట: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందే రోగులకు నగదు రహిత వైద్యం అందించేలా ఆసుపత్రి యాజమాన్యాలు తగు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ హెచ్చరించారు. మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీపై జిల్లా క్రమశిక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. దీనిలో 35 ఫిర్యాదులను కమిటీ సభ్యులు విచారించారు. వీటిలో మూడు ఏఎస్ఎం మొబైల్ యాప్, రెండు మెడికల్ ఆడిటింగ్ వింగ్, మరో 30 ఫిర్యాదులు 104 వాహనం ఐవీఆర్ అవుట్‌బౌండ్‌కాల్స్ ఉన్నాయి. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందుతున్న రోగి వద్ద డబ్బులు వసూలుచేసిన నిమ్స్ మల్టీస్పెషాల్టీ హాస్పిటల్‌కి నోటీసు జారీచేస్తూ, రోగికి డబ్బులు తిరిగి ఇప్పించి హాస్పిటల్‌కు నాలుగు రెట్లు పెనాల్టీ విధించారు. డీఎండీహెచ్‌ఓ డాక్టర్ జి.శోభారాణి, జిల్లా ప్రభుత్వ హాస్పిటళ్ల పర్యవేక్షణాధికారి డాక్టర్ బీవీ రంగారావు, రోటరీక్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.సునీల పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువులు సక్రమంగా అందజేస్తాం..

జిల్లాలో విత్తనాలు, ఎరువులు బ్లాక్‌మార్కెట్ చేసినా, అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కుర్రి సాయిమార్కొండారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. రైతుల నుంచి నిరంతరం ఫిర్యాదులు తీసుకునేందుకు కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి అందిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి తగిన చర్యలు చేపడతామన్నారు. సలహా మండలి అధ్యక్షుడు మార్కొండారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయంతో పాటుగా అనుబంధ రంగాల నుంచి ఆదాయం పొందేందుకు రైతులు ఉద్యాన పంటలతో పాటు పశువులు, చేపల పెంపకం చేపట్టాలని కోరారు. రైతులను ఖరీఫ్ సీజన్‌కు సమాయత్తం చేయాలని, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు రైతులకు సకాలంలో అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి మాట్లాడుతూ జిల్లాలో కంది, చిరు ధాన్యాల పంటల సాగు విస్తీర్ణం పెంచేలా ఆర్‌బీకేలలో రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. డిమాండును బట్టి విత్తనాలు రైతులకు అందేవిధంగా చర్యలు చేపట్టామన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల జిల్లా అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు, సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఇంట్లో ఉంచిన రూ. 20 లక్షలు మాయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): బీరువాలో ఉంచిన నగదు, బంగారం, వెండి వస్తువులు చోరీ చేసిన ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం న్యూ ఆర్‌ఆర్‌పేటకు చెందిన చందనాల ధనలక్ష్మి, భర్త, కుమారుడు, కోడలు, పిల్లలతో కలిసి నివసిస్తున్నారు. భర్త, కొడుకు ముఠా పనిచేస్తున్నారు. ఈనెల 4వ తేదీన ధనలక్ష్మి చెల్లెలు విజయలక్ష్మి వాంబే కాలనీలోని ఇల్లు అమ్మగా వచ్చిన రూ. 20లక్షలను అక్క ధనలక్ష్మికి ఇచ్చారు. అందులో ఒక లక్ష రూపాయలను పేటలో స్థలం కొనేందుకు అడ్వాన్స్‌గా ఇచ్చారు. తక్కిన నగదును బీరువాలో ఉంచారు. ప్రతి రోజు బీరువాలో నగదును చూసుకుంటున్నారు. 10వ తేదీన సైతం బీరువాలో నగదును చూడగా నగదు యథాతథంగా ఉంది. 10వ తేదీ రాత్రి ధనలక్ష్మి కుమారుడు, కోడలు, మనుమలు, కోడలు ఇంట్లో పడుకోగా ధనలక్ష్మి, భర్త, ధనలక్ష్మి చెల్లెలు వరండాలో పడుకున్నారు. మంగళవారం ఉదయం 7.30 గంటలకు ధనలక్ష్మి కోడలు ఫోన్ చేసి బీరువా తలుపు తెరిచి ఉందని, బీరువాలో ఉంచిన నగదు, బంగారు వెండి వస్తువులు కనిపించటం లేదంటూ బయటకెళ్లిన అత్త ధనలక్ష్మికి ఫోన్‌చేసి చెప్పింది. దీంతో ధనలక్ష్మి వెళ్లి చూడగా బీరువాలో ఉంచిన నగదు రూ. 19.15లక్షలు, సుమారు 3 కాసుల బంగారు ఆభరణాలు, 25తులాల వెండి పట్టీలు, 15 తులాల వెండి గ్లాసు, గిన్ని, చెంబు కనిపించలేదు. దీంతో ధనలక్ష్మి అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షేడ్ నెట్ నర్సరీలతో నాణ్యమైన నారు


నర్సరీలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి నవీన్‌కుమార్

నరసరావుపేట రూరల్: షేడ్ నెట్ నర్సరీల ద్వారా నాణ్యమైన నారు రైతులకు అందుబాటులో ఉంటుందని ఉద్యాన శాఖ అధికారి దాసరి నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలోని గురవాయపాలెం, పమిడిమర్రు గ్రామాల్లోని షేడ్ నెట్ నర్సరీలను మంగళవారం తనిఖీ చేసారు. నర్సరీల లైసెన్స్‌లు పరిశీలించారు. నర్సరీల యజమానులు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని తెలిపారు. నర్సరీ రిజిస్టర్స్ తప్పని సరిగా నిర్వహించాలన్నారు. విత్తనాలు ఇచ్చిన రైతులకు రసీదు ఇచ్చి నాణ్యమైన నారును రైతులకు అందించాలని తెలిపారు. రసీదులు ఇవ్వని నర్సరీలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు తప్పనిసరిగా బిల్లును పరిశీలించి విత్తనాలు తీసుకోవాలన్నారు. నారు ఆరోగ్యంగా పెంచడంలో మెలకువలను నర్సరీ యజమానులకు వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకుడు ఆంజనేయులు, వ్యవసాయ సహాయకుడు రవి పాల్గొన్నారు.

దుర్గగుడి కొబ్బరి చెక్కల టెండర్ వాయిదా

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో కొబ్బరి చెక్కలు పోగు చేసుకునే హక్కు కోసం మంగళవారం నిర్వహించి టెండర్ వాయిదా పడింది. దేవస్థానం నిర్ణయించిన మేరకు సరైన ధర రాకపోవడంతో వేలాన్ని వాయిదా వేస్తున్న ట్లు ఆలయ అధికారులు ప్రకటించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని మహామండపం ఆరో అంతస్తులో ఆలయ డీఈవో గురు ప్రసాద్ పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది వేలం నిర్వహించారు. బహిరంగ వేలంకు ఇద్దరు కాంట్రాక్టర్లు రూ. 5 లక్షల ప్రథమ దరావత్తుగా చెల్లించి వేలంలో పాల్గొన్నారు. మరో ఇద్దరు కాంట్రాక్టర్లు టెండర్ ఫారాలను కొనుగోలు చేసిన సీల్డ్ టెండర్ బ్యాక్‌లో వేయలేదు. దీంతో ఆలయ అధికారులు బహిరంగ వేలం ప్రారంభించారు. దేవస్థానం పాటను రూ. 90 లక్షలుగా నిర్ణయించి వేలం ప్రారంభించగా, కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు.

కొండచిలువ కలకలం

అడవిలో వదిలిన ఫారెస్టు అధికారులు


కొండచిలువను వదిలిన ఫారెస్టు అధికారి

మేదరమెట్ల: పంట పొలాల్లో కొండచిలువ కలకలం రేపింది. మంగళవారం కొరిశపాడు మండలంలోని ప్రాసంగులపాడు పొలంలో కొండచిలువ కనిపించడంతో పొలం రైతు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యాడు. స్థానికుల సహకారంతో కొండచిలువ ఉందని ఫారెస్టు అధికారులకు సమాచారం అందించాడు. తక్షణమే స్పందించిన ఫారెస్టు అధికారులు వై.జాన్సన్, రమేష్, శ్రీనివాసరావులు కొండచిలువ ఉన్న ప్రదేశానికి చేరుకొని క్షేమంగా పట్టుకొన్నారు. అనంతరం అడవిలో వదిలిపెట్టినట్లు అధికారులు తెలిపారు. కొండ చిలువ 15 అడుగులు ఉందని ఇలాంటి ప్రాణులు కనిపిస్తే తక్షణమే అధికారులకు తెలియజేయాలన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇంటి గోడలు ధ్వంసం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): స్థానిక బందులదొడ్డి సెంటర్ సమీపంలోని బండ్రెడ్డి సత్యనారాయణ ఇంట్లో మంగళవారం తెల్లవారుజామున (3 గంటల సమయంలో)గ్యాస్ సిలిండర్ పేలి ఇంటి గోడలు ధ్వంసం అయ్యాయి. పక్క పోర్షన్‌లో అద్దెకు ఉంటున్న ఇంకొల్లు కాటంరాజు ఇంటిలోని ఫ్రిడ్జ్ టీవీ, హోమ్ థియేటర్, మంచాలు, కుర్చీలు కూడా ధ్వంసం అయ్యాయి. కాటంరాజు రెండో కుమారుడు ప్రశాంత్ కాలిపై గోడరాళ్లు పడటంతో గాయాలన్నాయి. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు కుటుంబరావు, సంపత్, రవి, పరసా కృష్ణతో పాటు సీపీఎం, సీపీఐ నాయకులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. గ్యాస్ కంపెనీ వారి నుంచి బాధితులకు నష్టపరిహారం ఇవ్వాల్సిందిగా వారు డిమాండ్ చేశారు.